# ఈ దేశంలో నేనో ఆడపిల్లను

"అమ్మాయిలు కావాలా సార్?" సంతలో కూరగాయల నమ్మినంత తేలిగ్గా అడిగాడు రిక్షావాడు, రిక్షా స్లో చేస్తూ.

"ఏ రకం?" ఉత్సుకతతో ప్రశ్నించాడు రాంబాబు.

"ఇవాళ మామూలు సరుకే సార్. రేపయితే కాలేజీ అమ్మాయిలు దొరుకుతారు. రేపటివరకు ఉంటారా?"

"ఉంటాం. రేపు విశేష మేమిటో?" రిక్షాలో కూర్చొని 'పుట్‌పాత్' మీద కనిపిస్తున్న పచ్చదనం కేసి పచ్చిగా చూస్తున్నాడు రాంబాబు.

"మీకు తెలీనట్టడుగుతారేటి సార్? ప్రతి శనోరం ఉమెన్స్ కాలేజి ఆస్టలాడపిల్లలు లాడ్జిల్లో దొరుకుతారనే మీలాంటి స్టూడెంట్సు దూరాన్నుంచి పనిగట్టుకొస్తారు" మెయిన్‌రోడ్ నుంచి రిక్షాను పక్క వీధి పట్టించాడు.

"ఐ కాంట్ బిలీవ్" అన్నాడు అంత వరకు మౌనంగా వింటున్న మురళి రాంబాబు కేసి తిరిగి, రిక్షావాడికి తమ విషయాలు తెలీడం ఇష్టం లేక

"నిజం సార్ నేను మోసం చేసినా ఆళ్లతో మాట్లాడితే మీకు తెలీదా?" నవ్వుతున్నాడు రిక్షావాడు.

"నువ్వు చదువుకున్నావా?" గతుక్కుమన్నాడు మురళి.

"సెకండ్ ఫారం సదివానండి ఆ తర్వాత మీ స్టూడెంట్స్ మద్దిన మసలడం వల్ల ఇంగ్లీసు అర్థమవుద్దండి. మీరేటి సదువుతున్నారు సార్?"

"చదువయిపోయింది. మేమిద్దరం లెక్చరర్లుగా పనిచేస్తున్నాం." రాంబాబుకు అబద్ధం చెప్పాల్సిన అగత్యం కనిపించలేదు

"నేను మొదట్లో యూనివర్శిటీ స్టూడెంట్సనుకున్నా. కొత్తగా ఉద్యోగంలో సేరారా సార్?"

"ఆఁ—రెండేళ్ళయింది" వాడితో సాధ్యమైనంత తక్కువగా మాట్లాడ్డం మంచిదని మురళి అభిప్రాయం

"మీలాంటోళ్లంటే ఇక్కడమ్మాయిలు బాగా లైక్ సేస్తారు. ఉద్యోగస్తులకీ స్టూడెంట్లకే కాని అందరికీ ఒప్పుకోరు సార్."

"ఈ కాలేజీ వాళ్ళంతా ఈ రకమేనా?" అనుమానం తీరడం లేదు మురళికి.

---

పైడిపాల



''అంతా ఎందుకుంటార్లెండి. కొంత మంది ఈ రకం ఉంటారు. ఒకళ్ళను చూసి ఒకళ్లు నేర్చుకుంటా రండి ''

''ఇంతకు ముందు లేడీస్ హాస్టల్ లో అక్కడక్కడ ఇలాంటివి జరుగుతాయని విన్నాను. కాని అవన్నీ అబ్బాయిలు బులబాటంకొద్దీ ఎక్జాజరేట్ చేసి చెప్పేవనుకున్నా. అవి నిజమేనని ఇప్పుడు నమ్మాల్సొస్తోంది.'' మురళి అంతరాత్మ ఓ పట్టాన ఈ దారుణాన్ని నమ్మడం లేదు.

''మీకు కొత్తలా వుంది. పెళ్ళయిందా సార్?'' అదోలా నవ్వాడు రిక్షావాడు.

''లేదింకా'' ఈ సందర్భంలో అదో డిస్క్వాలిఫికేషన్ లా ఫీలయ్యాడు మురళి.

''అయితే మీకు అనుభవమున్న పిట్టనే వెదకాలి.''

''ఉహు ...నాకు '' కంగారు పడుతున్నాడు మురళి

''ఆ ...వచ్చేశాం, దిగండి'' రిక్షా ఆగింది. ఎదురుగా పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డు - హోటల్ 'పేరడైజ్'- బోర్డింగ్ అండ్ లాడ్జింగ్.

రిక్షావాడు సూట్ కేస్, ఎయిర్ బాగ్— రెండు చేతుల్లోకి తీసుకొని కౌంటర్ దగ్గ

రకు దారి తీశాడు.

ముందు నడుస్తున్న రాంబాబు, కౌంటర్ దగ్గర ఆగి పర్స్ తీస్తూ రిక్షావాడి కేసి చూశాడు

"వారికి దబుల్ రూమ్ కావాల్టండి రేపటికి ప్రక్క రూం కూడా కావాల్టండి" రిక్షావాడు ప్రొప్రయిటర్ వైపు చూసి కన్ను గీటాడు.

రాంబాబు దబ్బిస్తున్నాడు. మురళి అభ్యంతరంగా చూస్తున్నాడు.

"రూమ్ నెంబర్ సిక్స్‌టీన్. మీకు కన్వీనియంట్‌గా వుంటుంది." అడ్వాన్స్ తీసుకొంటూ బాయ్‌ని పిల్చి తాళాలిచ్చాడు ప్రొప్రయిటర్.

రూమ్ తెరిచేటప్పటికి ఇరవై రూపాయలకు దండగ కాదనిపించింది. లగేజ్ టేబుల్ దగ్గిర పెట్టి నిల్చున్నాడు రిక్షావాడు. ఫోమ్‌బెడ్ మీద చతికల బడ్డారు మిత్రులిద్దరూ.

"రిజర్వేషన్‌లో రూమెందుకు? నాకిష్టం లేదు" మురళిలో అయిష్టం కంటె భయం ఎక్కువగా కనిపించింది రిక్షావాడికి.

"భయపడుతున్నట్టున్నారు. రైడింగులేం జరగవిక్కడ. ఆ పూచీ నాది"

"అద్సరే కాని కాలేజీ అమ్మాయిల పేరుతో 'నాటు' తీసుకొచ్చి చిలక పలుకులు పలికిస్తే మాత్రం ఊరుకొనేది లేదు. ఇలా చెట్టు పేరు చెప్పి కాయలమ్మే వ్యాపారం చాలా చోట్ల చూశాను. మంచి సరుకు పట్రా. రేటెంతైనా ఫర్వాలేదు రేపటికి ఇద్దర్ని-ఫస్ట్‌క్లాస్‌గా ఉండాలి మరి" తాను అనుభవజ్ఞుడనని, రికావాడి టోకరాలో పడేవాణ్ని కానని వాడికి తెలియాలని రాంబాబు అభిప్రాయం.

"మీ యిష్టమొచ్చినట్టుంటారు. మరి మనిషికో వందైనా "

"ఆల్రైట్." రాంబాబు దృష్టిలో ఆ మొత్తం ఓ లెక్కలోది కాదు.

"అన్నట్టు ఆళ్ళతో కొన్ని షరతులున్నాయండోయ్. ఎమ్మిదింటి కొచ్చి పదికల్లా యెలిపోతారు. పైగా మొకాలు గుర్తుపడితే గుట్టు రచ్చకెక్కుతుందని లైటుండడాని కొప్పకోరండి "

"సర్లే" అన్నాడు రాంబాబు-ఇలాంటివి కొత్త కాదన్నట్టు. చదువుకొనే రోజుల్లో తెలుగు మాష్టారు చెప్పిన మాయాప్రవరుడు వరూధినికి విధించిన షరతులు గుర్తుకొచ్చాయి-మురళికి.

రిక్షా కూలి చేతిలో పెట్టాడు రాంబాబు.

"మరి ఈ రాత్రికి ...." నసిగాడు రిక్షావాడు

"అక్కర్లేదు. వేరే పనుంది " సిగరెట్టు తీసి వెలిగిస్తున్నాడు రాంబాబు రిక్షావాడు వెళ్ళిపోయాడు.

"ఏవిట్రా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్." తిరుగుతున్న ఫాన్‌కేసి అదే పనిగా చూస్తూన్న మురళిని కదలేశాడు

"రిక్షావాడి గురించి. మన రచయితలందరూ కథల్లో రిక్షావాళ్ళను గొప్ప నిజాయితీ పరులుగా చిత్రించి ఓ పేజీ జాలైనా ఒలకబోస్తారు. నిజ జీవితంలో వాడి పాత్ర ఇలా వుందే అని?"

"చిట్టి తండ్రి. రిక్షావాళ్ళంతా వీడిలా ఉండరు. కాలేజీ అమ్మాయిలంతా ఈ

వూరు ఉమెన్స్ కాలేజి హాస్టలాడ పిల్లల్లా ఉండరు. లెక్చరర్సంతా మనలా వుండరు. ఒకటి మాత్రం నిజం వాడు తీసుకొచ్చే కేసులు మాత్రం జెన్యూనే వాడి మాటలు వింటుంటే కాలేజీ వాతావరణం బాగా తెలిసిన వాడిలా ఉన్నాడు. బస్‌స్టాండ్‌లో మనలాంటి వాళ్ళను పట్టడమే వీడి బిజినెస్''

''నువ్వెన్ని చెప్పు పాతికేళ్ళు నిఖారైనై బ్రహ్మచారిగా వుండి రేపో మాపో పెళ్ళి చేసుకోబోతూ ఇప్పుడు కక్కుర్తి పడ్డం నా కిష్టంలేదు. నన్నొదిలిపెట్టు లేక పోతే ఆ అమ్మాయితో కాసేపు మాట్లాడి.''

''ఏం? ప్రవరాఖ్యుడిలా ఉపదేశాలు కాని చేస్తావేమిటి? ఇలాంటి వెర్రిమొర్రి వేషాలెయ్యక నేను చెప్పినట్టు బుద్ధిగా విను ఈ ఛాన్సు మళ్ళీ రమ్మంటేరాదు ఫస్ట్‌కేస్ ఇలాంటిది దొరకడం నీ అదృష్టం'' యాష్ ట్రేలో సిగరెట్టు పడేస్తూ కుడిచేత్తో మురళి చేతిని మృదువుగా నొక్కాడు రాంబాబు.

మురళి మాట్లాడలేదు

''లే తొందరగా స్నానంచేసి డ్రెస్ చేసుకో. లేటయితే గురువుగారు అవుటాఫ్ మూడ్స్‌లో ఉంటారు'' రాంబాబు ఇన్ షర్ట్ తీసేస్తున్నాడు

''ముందు నువ్వు కానియ్.''

రాంబాబు బాత్రూమ్ తలుపు తెరిచాడు. మురళి లేచి కిటికీ దగ్గర నిల్చుని బయటకు చూస్తున్నాడు. చీకటిలో మెరుస్తున్న రంగు రంగుల దీపాలతో వింత వింత శబ్దాలతో నగరం సర్కస్ గుడారంలా కనిపించింది.

* * *

''నమస్కారం మాష్టారూ!''

''ఏం మహానుభావా. ఇన్నాళ్లకు గుర్తు కొచ్చామా? రా. లోపలకు రా''

''ఇతను మురళి అని కెమిస్ట్రీ లెక్చరర్. ఈయన రాందాసుగారు. మా మాష్టారు''

''గ్లాడ్ టు సీ యు'' షేక్ హాండ్‌తో రిసీవ్ చేసుకున్నాడు రాందాసు.

''ఏవిటి విశేషాలు? ఇంకా అక్కడే పన్చేస్తున్నావా?'' రామదాసు రాంబాబు ఎమ్మే చదివే రోజుల్లో దగ్గరయిన యూనివర్శిటీ లెక్చరర్.


''ప్రస్తుతాని కక్కడే, మరో మంచి కాలేజి ఏదైనా చూసుకొని మారిపోదామనుకుంటున్నా. కాలేజి పాలిటిక్స్ మరీ అసహ్యంగా తయారయ్యాయి.''

''ఈ రోజుల్లో అవి లేని దెక్కడ? ఒకో కమిటీ కాలేజి ఒకో కులానిది దూరపు కొండలు నునుపంతే. ఎలాగో సర్దుకుపోవడం మంచిది''

''మీకు తెలీదు మా కాలేజి కంటె పందుల దొడ్డి నయం. కులాలూ, శాఖలూ- ఈ రొంపిలోపడి కొట్టుకు చస్తున్నారు జనం. లెక్చరర్సే కుర్రాళ్ళతో చేతులు కలిపి అవతలి వర్గంమీద వుసిగొల్పే కాలేజిలో పాఠాలు చెప్పడం ఎంత కష్టమో మీరే ఊహించండి.''

''కొత్త గనుక మరింత ఆవేశపడుతున్నారు అలవాటుపడితే ఇంత 'బాధ' అనిపించదు. తొందరపడి ఉద్యోగాలు మాత్రం వదులుకోకండి.''

''ప్రిన్సిపాల్ నుంచి మొదటి సారి




'మెమో' అందుకున్నప్పుడు అంతపనీ చెయ్యబోయాడు మురళి. నేను నచ్చజెప్పిన తర్వాత 'రిజిగ్నేషన్ లెటర్' చించేశాడు!'' నవ్వుతున్నాడు రాంబాబు.

''అంతా బావున్నారా ? పిల్లలెంతమంది ?'' కావాలని టాపిక్ మార్చాడు రామదాసు.

''పాప మీకు తెలుసుగా. ఆ తర్వాత కూడా ఆడపిల్లే. ఏడాదయింది. ఆపరేషన్ చేయించేశాను. అంతకంటె అయితే ఈ రోజుల్లో కష్టం మాష్టారూ.''

''నీ కేవయ్యా. బంగారపు పిచ్చికవి. దులిపితే కనకవర్షం కురిపించే కల్పతరువు లాంటి మావగారున్నాడు. ఆ! - ఇంతకీ వచ్చినపని చెప్పావు కాదు.''

''ముఖ్యంగా మిమ్మల్ని చూడాలని పోతే దేశంమీద పడి వెకేషన్ని సద్వినియోగం చేదామని టూర్స్ రూమ్‌కి వెళ్దామా ?''

రూమ్ అనేటప్పటికి రాందాసుకి నోరూరింది. టాక్సీలో ముగ్గురూ పేరడైజ్ చేరుకున్నారు

కాలింగ్ బెల్ మోగింది బాయ్ నిల్చున్నాడు - వినయంగా రెండుచేతులు కట్టుకొని.

'మాష్టారూ !' ఏం కా వా లో చెప్పండి అన్నట్టు చూశాడు రాంబాబు. రామదాసు మురళికేసి అభ్యంతరంగా చూసిన చూపుకి ఫర్వాలేదన్నట్టు రాంబాబు నుంచి సమాధానం వచ్చింది.

క్షణాల్లో స్కాచ్ విస్కీ బాటిల్, సోడాలు, కేష్యూనట్స్ తీసుకొచ్చి వెళ్ళిపోయాడు బాయ్.

రెండుగ్లాసుల్లో పోసి మూడోదాన్ని కూడా నింపబోయాడు రామదాసు!

''సారీ సర్ నా కలవాటు లేదు''

అలా చెప్పడానికి మురళి సిగ్గుపడు తున్నాడు.

"అలవాటు అలవాటు చేసుకొంటే గాని ఎలా అవుద్ది. మై డియర్ గుడ్ బాయ్-హేవిట్" బలవంతంగా చేతిలో పెట్టాడు రాందాసు

"మా వాడు మరీ చద్దన్నం - గ్లాసు మజ్జిగ మార్కు మనిషి" నవ్వాడు రాంబాబు.

"ఛీర్స్ " మరేం చెప్పుకోడానికీ మురళికి అవకాశమివ్వలేదు. మురళి బ్రతిమాలుకొని మొదటి రౌండ్ లో ఆగిపోయాడు. మధ్యలో జోక్స్ నవ్వులు తుళ్ళులు సెకండ్ రౌండ్ తర్వాత రాంబాబు చెప్పాడు.

"మా తోడల్లుడి పేపరు మీ దగ్గరికి థర్డ్ వేల్యూయేషన్ కొచ్చింది. ఇంటర్నల్ 56 వేస్తే, ఎక్స్టర్నల్ 26 వేశాడట ఈ పేపర్ మీరో చూపు చూస్తే ఫస్టుక్లాస్ లో పడతాడు, మిగతావి అతడే మేనేజ్ చేసుకున్నాడు, నెంబరు "

నోట్ చేసుకున్నాడు రాందాసు

"ఎన్ని వెయ్యమంటావు బాయ్ 126 వెయ్యనా? యూనివర్శిటీ ఫస్టవుద్ది?" మళ్లీ గ్లాసులు నింపుతున్నాడు రామదాసు.

"టాటాఫ్?-" ఉత్సుకతతో అడిగాడు మురళి.

"వన్ఫిప్టీ ' రాంబాబు నవ్వాడు,

"ఈజిట్ పాజిబుల్?" కళ్లు పెద్దవి చేశాడు మురళి. వాటీజ్ "ఇంపాసిబుల్" ప్రొఫెసర్ రాందాసు నమః గదిలో ప్రతి మురళికి నిల్చున్న నేల గిర్రున తిరుగుతున్నట్టనిపించింది.

* * *

మర్నాటి మధ్యాహ్నంవరకు మురళి జీవితంలో దిద్దుకోలేని పొరపాటు చేసినట్టు కుమిలిపోయాడు.

"సిల్లీ! ఎందుకంత బాధపడ్తావు. మందు కొట్టడం పాపమా?" రాంబాబు సమాధానపర్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఇంతవరకు జీవితంలో రుచిచూడనివి రెండేరెండు. ఒకటి మందు. రెండు మగువ. ఎలాగూ ఒకదానికి దిగజారాను గనుక రెండోదికూడా చూసేస్తాను "

"వెరీ గుడ్. సాహసం చెయ్యరా డింభకా ."

"కాని రాధకి అన్యాయం చేస్తున్నానని ఓ మూల "

"రాధ .నీ వుడ్ బి కదూ, ఆ మాట కొస్తే అన్యాయం చెయ్యకుండా ఉండడానికే ఇది. డోంట్ బి సెంటిమెంటల్"

తలూపాడు మురళి

* * *

లైటు ఆరిపోయింది. బెస్టాఫ్ లక్ చెప్పి రాంబాబు సెవంటీన్ లోకి వెళ్ళిపోయాడు.

చీకటిలో మెరుపు తీగలాంటి ఆకారం వచ్చి గుమ్మం దగ్గర నిలబడింది. 'వెళ్లు' ఎవరో తోస్తున్నారామెను.

"మే ఐ కమిన్?" ఆ గొంతు టీనేజ్ ఆడపిల్లది.

"విత్ ప్లెజర్" డోర్ లాక్ చేసి ఆమె నడుము మీద చెయ్యి వేసి మంచం వరకు

తేనె మనసు (లూ)-దేవదాసూ కృష్ణకు
హైలైట్స్
పని నీవంతు-ఫలితం నావంతూ అని
చెప్పే అతగాడివే రియల్ గట్స్
బాండ్ సైపు వేషాలు బయటపెట్టాయి
ట్యాలెంట్స్
వాటితోనే పెరిగిపోయారు అతనికి
ఫేవరెట్సు.



---

''కిటికీలోంచి పడుతున్న వెలుగు చారలో ఆమెను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు మురళి. స్పష్టంగా రూపురేఖలు కనిపించక పోయినా ఆమె అందాన్ని చీకటి దాచలేక పోతోంది

చెక్కిలి నిమురుతూ ''పేరు...?'' అన్నాడు.

''మైథిలి'' కాలేజి అమ్మాయి కాని అంత స్టయిల్‌గా ఉచ్చరించ లేదు.

''ఏం చదు వు తున్నావ్?'' నరాల్లో విద్యుత్తు ప్రసరిస్తోంది. గొంతు వణుకుతోంది.

''సెకండ్ బి. ఏ'' పల్చని పెదవులు కదిలాయి మధ్య పలువరస మెరిసింది. అతని నిగ్రహం సడలింది. రెండు చేతుల్తో బలంగా ఆమెను హృదయానికి హత్తుకొని పెదవుల్ని చుంబించాడు

* * *

''నీ పేరేమిటన్నావ్?'' మెడమీద ముద్దుల వర్షం కురిపిస్తూ అడిగాడు రాం

''కళారాణి'' తియ్యగా మూలిగినట్టుందా స్వరం.

''బాగా ఉన్నదానిలా కనిపిస్తున్నావ్?'' మెళ్లో ఖరీదైన లాకెట్ చీకట్లో మెరుస్తోంది

''మా డాడీ లాండ్‌లార్ట్‌రాం'' అతని ఉంగరాల జుత్తును చేత్తో సవరిస్తోంది రాణి,

''మరింకా ఎందుకీ వృత్తి?''

''వృత్తికాదు—సరదా''

''ఈజిట్?'' ఆశ్చర్యపోయాడు రాంబాబు.

''యా!—నీలాగే నలుగుర్ని చూడాలని '' కౌగిలి మరింత బిగిసింది

* * *

చీకట్లో వెక్కిళ్లు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

''మైథిలీ ఏడుస్తున్నావా? కన్నీళ్లు చేత్తో తుడుస్తూ అడిగాడు మురళి ''ఇదే మొదటిసారా?''

"దానికేముంది?—నాక్కూడా ఇదే మొదటి అనుభవం ఎప్పుడూ తప్పుపని చెయ్యనివాణ్ణి పరిస్థితులకు బానిసనయ్యాను అయినా నాకేం ఫర్వాలేదు మగవాణ్ణి. నువ్విలా ఎందుకు దిగజారావ్? పైగా చదువుకున్న దానివి!"

"దిగజారడానికి చదువడ్డురాదు. నేను చదువుకుంటున్న దాన్ని. మీరు చదువు చెప్తున్నవారు కూడా " మురళి షాక్ తిన్నాడు.

"చదువుకున్న నేరమే నాచేత ఈపాపం చేయించింది చదువు ఈరోజుల్లో డిస్క్వాలిఫికేషన్ చదువుకున్న ఆడపిల్లకి అంత కంటె ఎక్కువ చదివిన వరుణ్ణి వెతకాలి. అతగాడి రేటు ఎంత తక్కువయినా లాంఛనాలు కాకుండా పదివేలు అటు చదువులకీ ఇటు కట్నాలకీ నలుగురేసి ఆడపిల్లలున్న తండ్రులు ఈ వేలన్నీ ఎక్కడ దులుపుకు రాగలరు చెప్పండి. పోనీ ఓ రెండేళ్ళు ఉద్యోగం చేయించి పెళ్ళి చేద్దామంటే ఉద్యోగినికి పెళ్ళవడం దీనికి రెండింతలు కష్టం ఈ పరిస్థితుల్లో చదువుకున్నఆడపిల్ల, కని పెంచిన నేరానికి తండ్రి గుండెల్లో చిచ్చుపెట్టాల్సిందేనా?"

"మీ బాధ నా కర్థమయ్యింది. అభ్యంతరం లేకపోతే మీ కథ వినాలనుంది "

"మానాన్న హైస్కూలు టీచరు. జీతమే కాని గీతంలేని ఉద్యోగం, సంతానం నలుగురూ ఆడపిల్లలమే పెద్దవాళ్ళిద్దరికి చదువులకీ కట్నాలకీ ఉన్న రెండెకరాలకొంచ్ర సరిపోయింది అతికష్టం మీద నన్నెలాగో ఈ డిగ్రీ చదివిస్తున్నాడు. ఈలోగా పెళ్ళి చెయ్యాలని అమ్మ పోరు. సంబంధాలకోసం కాళ్ళరిగేలా తిరిగేడు మా కట్నం సరిపోక అనేక సంబంధాలు తప్పిపోయాయి. చివరకు ఓ కాలేజ్ లెక్చరర్ సంబంధం ఖాయమయింది, కాని వాళ్ల పెద్దలు మానాన్న ఇవ్వడానికి సిద్ధపడిన పదివేలూ కాక మరో అయిదైనా ఇస్తేకాని లాభంలేదని చెప్పేశారు ఆయనో అభినవ శ్రీరామచంద్రుడు నాకంటె మా నాన్నకి బాగా నచ్చాడు ఆ సంబంధం ఎలాగైనా చెయ్యాలని ఆశ కాని తాహతు లేదు. ఎలాగో తల తాకట్టుపెట్టి కట్నమివ్వడానికి నానాయాతనలు పడుతున్నాడు. నా కక్కరలేదని చెప్పినా విన్లేదు. కాని ఎక్కడా అప్పు పుట్టలేదు. తొందరగా ఏమాటా చెప్పమని అవతలనుంచి కబుర్లు. నాన్న బెంగతో మంచంపట్టాడు, ఇవతల కాలేజీ ఫీజులూ, పుస్తకాలు, హాస్టల్‌బిల్స్ సంవత్సరానికో రెండువేలన్నా కావాలి."

"అయితే కేవలం డబ్బుకోసమే ఈ వృత్తి లోకిదిగావన్నమాట?"

"లేకపోతే మీలా ఒళ్ళు కొవ్వెక్కి అనుకుంటున్నారా? ఈ కాలేజీ హాస్టల్లో ఓ అంటురోగం ఉంది. అది ఎలా వ్యాపించిందో తెలీదు కాని సగంమంది పైగా ప్రతిశనివారం లాడ్జిల కెగబడి డబ్బు సంపాదించుకొని ఫాషన్లకీ సరదాలకీ ఖర్చుపెడుతూ విలాసంగా జీవిస్తారు. అందరూ కేవలం డబ్బుకోసమేకాదు. ఉన్నవాళ్ళు కూడా సరదాకోసం వస్తారు. ఇక్కడ దాన్ని తప్పుగా భావించనంతగా ఈరోగం ప్రబలిపోయింది. నాసమస్యనిపరిష్కరించుకోడానికి ఇదో సాధనం కనిపించింది. నెల్లాళ్ళుగా ఆలోచించి చివరకు అందరి కోరిక తీరడానికి ఈ రోజు నేనీ నిర్ణయానికొచ్చాను. ప్రభుత్వం స్కాలర్‌షిప్

ఇస్తుందనీ. ఇక నాకు డబ్బు పంపించ నక్కరలేదనీ ఉదయం ఇంటికో ఉత్తరం రాసి పడేశాను. ఆ తర్వాత ఏ లాటరీ వచ్చిందనో ! డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలున్నా నాకందుబాటులో వున్న ఈ మార్గా న్నెన్నుకున్నా

కాబోయే భర్తకి ఇది ద్రోహం అనుకోవడం లేదు నేను. మహా పతివ్రత అనసూయ భర్త గౌరవాన్ని నిలపడం కోసం త్రిమూర్తులను పసి పాపల్ని చేసి తాను వివస్త్ర అయింది. సుమతి కామాంధుడైన భర్త వాంఛ తీర్చడం కోసం వేశ్య ఇంటికి మోసుకెళ్లింది. సీత జనాపవాదానికి భయపడిన రాముడి కోసం అగ్ని ప్రవేశం చేసింది వాళ్లు పుట్టిన పుణ్య భూమిలోనే నేనూ పుట్టాను. అంచేత నా కాబోయే భర్త ప్రియమైన మొదటి కోరిక పదిహేను వేల రూపాయలు సమకూర్చడం కోసం శక్తి మేరకు ప్రయత్నిస్తున్నా మరి నేను కూడా ''

''మైథిలీ ప్లీజ్. మరేం చెప్పకు'' అతని గొంతు గాద్గదిక మయ్యింది.

''మీకేమైనా జ్ఞాపకం తెచ్చి బాధ పెడితే నన్ను క్షమించండి ''

అతని ఆలోచనలు అతన్ని తవ్వుతున్నాయి.

''మైథిలీ, నేను కూడా మీ హీరో కోవకి చెందిన దౌర్భాగ్యుణ్నే! ఉద్యోగంలో ప్రవేశించింది మొదలు అనేక సంబంధాలు వచ్చాయి. కాని చదువుకొన్న అమ్మాయిని కాని చేసుకోనన్నాను. కట్నం ప్రధానం కాదన్నాను. చదువుకున్న పిల్లయితే నా రేటు తగ్గుతుందని నాన్న బెంగ నేను గట్టి పట్టు పట్టడంతో చదువుకున్న అమ్మాయిల వేట ప్రారంభించాడు. సంతలో దూళ్ళబేరం చేసినట్టు అందర్నీ చూసి ఇంటర్వ్యూలో ప్రశ్నల వర్షం కురిపించే సరదా నాకు లేదు. వచ్చిన వాటిలో వివరాలను బట్టి కృష్ణ నగరం సంబంధం నచ్చింది ఆయన కూడా మీ నాన్నగారిలా టీచరే. ఆ అమ్మాయి పేరు రాధ ''

''మీ పేరు మురళీమోహన్, కదూ?'' ఆమె గొంతు తడబడింది

''అయితే నువ్వు '' ఎక్స్‌రే చూపులతో ఆమె మొహంలోకి చూస్తున్నాడు

''రాధని, మైథిలిని, మరో మాధవిని. పేరేదయితేనేం-ఈ దేశంలో నేనో చదువుకున్న ఆడపిల్లని మన్నించండి!'' బయటి చీకట్లోకి రివ్వున బాణంలా దూసుకుపోయింది! ★